కనులపండువగా పుష్పయాగం



సీతాలక్ష్మణ సమేత కోదండరాముడికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం పుష్పయాగం కనులపండువగా నిర్వహించారు. కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రం ధ్వజావరోహణతో ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో గాని, నిత్యకైంకర్యాల్లో తెలిసీతెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మంగళవారం సుప్రభాతంతో స్వామివారిని మేలుకొలిపి ఆలయ శుద్ధి ఆరాధన చేశారు. సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం ప్రారంభించారు. తులసిదళాలు, చామంతి, రోజా, మల్లెలు, సంపంగి తదితర పుష్పాలు, పత్రాలతో సీతాలక్ష్మణ సమేత కోదండరాముడికి నీరాజనాలు సమర్పించారు. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సుమారు 2.5 టన్నుల పుష్పాలు భక్తులు విరాళంగా అందజేశారు. యాగం నిర్వహణ వల్ల సకల దోషాలు తొలగిపోతాయని కంకణబట్టర్ రాజేశ్‌కుమార్ తెలిపారు. బ్రహ్మోత్సవాల అనంతరం పుష్పయాగం, ఏకాంతసేవ నిర్వహించడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కనులారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్ బాబు, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది హనుమంతయ్య, నవీన్, ఆలయ అర్చకులు, వీణా రాఘవాచార్యులు, శ్రావణ్‌కుమార్, మనోజ్‌కుమార్, పవన్‌కుమార్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైవీయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పోస్టుగ్రాడ్యుయేషన్ (ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంపీఈడీ, ఎంసీఏ) నాలుగో సెమిస్టర్, ఎంఎస్సీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పరీక్షలు మంగళవారం విశ్వవిద్యాలయ ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ భవనంలో ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావుతో కలిసి తనిఖీ చేశారు. పలువురు విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్షల సూపరింటెండెంట్ ఆచార్య కాత్యాయని మాట్లాడుతూ 543 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఒకరు మాత్రమే గైర్హాజరయ్యారని తెలిపారు. నిర్వహణకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని వివరించారు. పరీక్ష కేంద్రం అబ్జర్వర్లు డాక్టర్ ప్రమీల మార్గరేట్, డాక్టర్ రాఘవేంద్ర పరీక్షల కేంద్రాన్ని పరిశీలించారు.



పీజీ పరీక్షలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ పద్మ

జిల్లావ్యాప్తంగా కార్డెన్ సెర్చ్

● 111 ద్విచక్రవాహనాలు, 3 ఆటోలు, ఒక బొలెరోస్వాధీనం

కడప క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం తెల్లవారుజామున జిల్లా వ్యాప్తంగా పలు పోలీసుస్టేషన్ల పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో రికార్డులు లేని 111 ద్విచక్రవాహనాలు, 3 ఆటోలు, ఒక బొలెరో క్యాంపర్ వాహనం స్వాధీనం చేసుకున్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీచేశారు. పాత నేరస్తులు, అనుమానితుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలు, అనుమానితుల కదలికలపై సమాచారాన్ని డయల్ 100కు ఫోను చేసి తెలపాలని సూచించారు.

పాలన సాగేదెలా..?





ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులకు పనిభారం పెరుగుతోంది. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రతి పనిని చక్కబెట్టాల్సిన తహశీల్దార్లు తగినంత మంది లేక ఇన్‌చార్జిలతో పాలన సాగుతోంది. ఫలితంగా ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా సమర్థవంతంగా నిర్ణయాలు తీసుకునే తహశీల్దార్లు లేరు. దీంతో కడప, అన్నమయ్య జిల్లాల్లో రెవెన్యూలో పాలన గాడి తప్పిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

- ఉమ్మడి జిల్లాలో 20 మంది తహశీల్దార్ల కొరత
- అన్నమయ్యలో 15 మంది, కడపలో ఐదుగురు
- ఫిర్యాదుల పరిష్కారంలో సతమతమవుతున్న వైనం
- పేరుకు పోయిన ఫైళ్లు, ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మనిషి పుట్టుక నుంచి చనిపోయేంత వరకు రకరకాల సర్టిఫికెట్లు జారీ చేయడం మొదలు సమస్యలున్న భూముల రీసర్వే, రెవెన్యూ సదస్సులు, ప్రభుత్వ పథకాల అమలు, జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో ప్రోటోకాల్‌తో పాటు కోర్టు కేసులు చూడాల్సిన బాధ్యత తహశీల్దార్లదే. ఇంతటి కీలకపాత్ర పోషించే తహశీల్దార్లు 20 మంది కొరత ఏర్పడింది. దీంతో ఇన్‌చార్జి తహశీల్దార్లు పాలన సాగడంతో నెలల తరబడి ఫైళ్లు పరిష్కారానికి నోచుకోక పేరుకుపోతున్నాయి.

20 మంది తహశీల్దార్ల కొరత

2022 ఏప్రిల్ 2వ తేదీన జిల్లాల పునర్విభజన జరిగింది. అందులో భాగంగా కడప జిల్లాలో అంతర్భాగమైన రాయచోటి కేంద్రంగా రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గాలు కలిపి అన్నమయ్య జిల్లా ఏర్పడింది. జిల్లా కేంద్రమైన రాయచోటిలో కలెక్టరేట్, మిగతా శాఖలను నూతనంగా ఏర్పాటు చేశారు. ఆ భవనాల్లో సరైన మౌలిక వసతులతో పాటు సిబ్బందిని నియమించే విషయంలో అప్పటి వైసీపీ సర్కారు సరైన నిర్ణయాలు తీసుకోకపోవడంతో ఇప్పుడు రెవెన్యూ ఉద్యోగులకు పనిభారం పెరుగుతోంది. నూతనంగా కలెక్టరేట్, ఇతర శాఖల నుంచి అధికారులు, సిబ్బందిని సమకూర్చే విషయంలో కడప, చిత్తూరు జిల్లాల్లో కీలక శాఖల్లో పనిచేసే సిబ్బందిని సగానికి పైగా ఇక్కడకు మార్చారు. దీంతో సేవలు సమస్యల పరిష్కార విషయంలో సగం-సగం అన్నట్లుగా పెండింగ్‌ల మీద పెండింగ్‌లు పెడుతూ ప్రజలకు తిప్పలు తెస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలతో క్షేత్రస్థాయిలో మమేకమై ఉండే రెవెన్యూశాఖలో అన్నమయ్య జిల్లాలో 15 మండలాలకు తహశీల్దార్లు లేకపోవడంతో ఇప్పటికీ ఇన్‌చార్జిలే సేవలు అందిస్తున్నారు. అందులో పెనగలూరు, రాజంపేట, పుల్లంపేట, రామాపురం, చిట్వేలి మండలాలతో పాటు మరో 10 మండలాల్లో ఇన్‌చార్జి తహశీల్దార్లే దిక్కయ్యారు. కడప జిల్లాలో సైతం 5 మండలాలకు తహశీల్దార్లు లేక ఇన్‌చార్జిల పాలన సాగుతోంది. అందులో గోపవరం, సిద్దవటం, ముద్దనూరు, జమ్మలమడుగు, ఆర్డీవో కార్యాలయాలున్నాయి.

పనిభారం పెరగడంతో అనారోగ్యం ముప్పు?



జిల్లాల పునర్విభజన తరువాత అన్నమయ్య కడప జిల్లాల్లో చాలినంత సిబ్బంది, అధికారులు లేరు. సగం మంది మాత్రమే సిబ్బంది ఉండటంతో వీరిపై పనిభారం రెట్టింపయింది. రెండు జిల్లాల్లో విపరీతమైన ఒత్తిడి మధ్య సిబ్బంది అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. నెలలో కొన్ని రోజులు రేయింబవళ్లు పనిచేయడంతో మూడొంతుల మంది బీపీ, షుగర్ వ్యాధుల బారిన పడ్డట్లు వాపోతున్నారు. ఇలాగే పనిభారం ఉంటే హార్ట్ అటాక్‌లు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2022లో జిల్లాల పునర్విభజన జీవో వచ్చినప్పటి నుంచి తమకు తిప్పలు తప్పడం లేదని అంటున్నారు. కాగా కడప కలెక్టరేట్‌లో 10 సెక్షన్లలో సూపరింటెండెంట్లు ప్రజలకు సకాలంలో సేవలందించే వారు. కడప నుంచి విడిపోయి అన్నమయ్య జిల్లా ఏర్పాటు జరగడంతో కలెక్టరేట్‌లోని సిబ్బంది పక్క జిల్లాకు సర్దుబాటు చేశారు. దీంతో కడప కలెక్టరేట్‌లో ఉన్న 10 సెక్షన్లను 4 సెక్షన్లుగా మార్పు చేశారు. ఒక్కొక్క సూపరింటెండెంట్ పరిధిలో 2, 3 సెక్షన్లు కలపడంతో, అధికారులు అడిగిన వెంటనే సమాచారం చేరవేయడం తలకుమించిన భారంగా మారిందని అంటున్నారు. ఇదే పరిస్థితి అన్నమయ్య జిల్లాలో సిబ్బందికీ తప్పలేదు.

పదోన్నతుల కోసం పడిగాపులు

కొత్త జిల్లాలు ఏర్పడడంతో రెవెన్యూలో జోన్-4 పరిధిలో సీనియర్ డిప్యూటీ తహశీల్దార్లు, ప్రొహిబిషన్ డిప్యూటీ తహశీల్దార్ల మధ్య పదోన్నతుల విషయంలో ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. పదోన్నతుల వివాదం రేగడంతో జోన్-1కు చెందిన 2018 నాటి పీడీటీలు కోర్టులో అమీతుమీ తేల్చుకొనేందుకు సిద్ధమయ్యారు. దీంతో ర్యాంకర్స్ వర్సెస్ పీడీటీల మధ్య కోర్టులో వార్ ఇప్పట్లో తెగడం అసాధ్యమంటున్నారు. వీరిమధ్య రాజీ కుదిరితే తప్ప పదోన్నతులు అసాధ్యమంటారు. ఇలాంటి సమయంలో డిప్యూటీ తహశీల్దార్లకు ఈ రెండు జిల్లాల్లో మరింత డిమాండ్ పెరిగిందంటారు. ఖాళీగా ఉన్న మండలాలకు తహశీల్దార్ల నియామకాల విషయంలో రాజకీయ పలుకుబడి ఉన్న డిప్యూటీ తహశీల్దార్లు ఈ రెండు జిల్లాల్లో ఇన్‌చార్జి తహశీల్దార్లుగా పోస్టింగ్‌లు దక్కించుకుని చక్రం తిప్పుతుండడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకుని రెగ్యులర్ తహశీల్దార్లను నియమించాలని రెవెన్యూ ఉద్యోగులతో పాటు ప్రజలూ కోరుతున్నారు.

602 మొబైల్ ఫోన్ల రికవరీ

● ఫోన్ల రికవరీలో జిల్లాకు మంచి గుర్తింపు : ఎస్పీ

కడప క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పోగొట్టుకున్న, చోరీకి గురైన 602 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో ఆయన అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు, సైబర్ సెల్ సీఐ మధుమల్లేశ్వర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 'ఆపరేషన్ మొబైల్ షీల్డ్' కింద కడప సైబర్ క్రైం పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి భారీ మొబైల్ ఫోన్లను రికవరీ చేశారన్నారు. సెంట్రల్ రిక్రూట్‌మెంటు ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా అందిన మొత్తం ఫిర్యాదుల మేరకు 602 మొబైల్స్ రికవరీ చేశామని వీటి విలువ సుమారు రూ.1.8 కోట్లు ఉంటుందన్నారు. ఇప్పటి వరకు ఆరు విడతల్లో రూ.9.2 కోట్ల విలువైన 4,670 మొబైల్ ఫోన్లు రికవరీ చేశామన్నారు. ఆధునాతన డిజిటల్ ఫోరెన్సిక్, జీపీఎస్ ట్రాక్, ఐఎంఈఐ ద్వారా వీటిని గుర్తించామన్నారు. ఎవరైనా మొబైల్స్ పోగొట్టుకుంటే మిస్సింగ్ మొబైల్, ట్రాకింగ్ సిస్టం వాట్సాప్ 9392941541కు కాల్ చేసి వివరాలు తెలుపవచ్చన్నారు. లేదా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయవచ్చన్నారు. సైబర్ క్రైం మోసాలకు గురైన వెంటనే డయల్ 1930కు కాల్ చేసి తెలపాలన్నారు. అపరిచితుల వీడియో కాల్స్, ఫిషింగ్ కాల్స్, ఈమెయిల్స్‌కు స్పందించరాదన్నారు. సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనేటప్పుడు ఫోను బిల్లు, సెల్‌ఫోను బాక్స్, ఫోను అమ్మే వ్యక్తి గురించి సరిగా పరిశీలించాలన్నారు. అనంతరం బాధితులకు మొబైల్ ఫోన్లను అందజేశారు. మొబైల్ ఫోన్ల రికవరీ ఆపరేషన్‌లో పనిచేసిన ఇన్‌స్పెక్టర్ మధుమల్లేశ్వర్‌రెడ్డి, సిబ్బంది శ్యాంప్రసాద్‌రావు, నరహరి, శ్రీనివాసులు, అమర్‌నాథరెడ్డిలకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందించారు.



ఫోన్లను రికవరీ చేసిన సైబర్ సెల్ టీంతో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, ఏఎస్పీ ప్రకాశ్‌బాబు



పోలీసులు రికవరీ చేసిన మొబైల్ ఫోన్లు

రెవెన్యూ అంశాలపై నేడు కలెక్టరేట్‌లో వర్క్‌షాపు

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ అంశాలపై బుధవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో వర్క్‌షాపు జరగనుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు సెషన్లుగా ఈ వర్క్‌షాపు నిర్వహించనున్నారు. మండలాలు, నియోజకవర్గాల వారీగా రెవెన్యూ అధికారులతో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సమీక్షించనున్నారు. ఇందులో ప్రధాన అజెండాగా ల్యాండ్ అక్విజేషన్, ప్రైవేట్ భూముల 22(ఏ)జాబితా, భూముల క్రమబద్ధీకరణ, ప్రభుత్వ భూములు, ఇనాం భూములు, ఆర్‌ఓఆర్-వెబ్‌ల్యాండ్, రీసర్వే తదితర సమస్యలపై కలెక్టర్, జేసీలు రెవెన్యూ అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఉదయం జరిగే సెషన్‌లో బద్వేలు, కడప, కమలాపురం, మైదుకూరు నియోజకవర్గాలలో నెలకొన్న రెవెన్యూ సమస్యలపై సమీక్షిస్తారు. మధ్యాహ్నం రెండవ సెషన్‌లో జమ్మలమడుగు, పులివెందుల, ప్రొద్దుటూరు నియోజకవర్గాలతో పాటు, కడప రెవెన్యూ డివిజన్‌లో ఉన్న సిద్దవటం, ఒంటిమిట్ట ప్రాంతాల రెవెన్యూ అంశాలపై సమీక్షించనున్నారు. ఈ మేరకు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు సర్క్యులర్ జారీ చేశారు.

ఆక్రమణలు తొలగించండి

● జడ్పీ వైస్ చైర్‌పర్సన్

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం మైదుకూరు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆక్రమణలు తొలగించాలని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, ఎంపీపీ శేఖర్ యాదవ్ కోరారు. ఆ మేరకు వారు మంగళవారం తహశీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారు అజయ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనిరెడ్డి రామచంద్రారెడ్డి కాంప్లెక్స్ రూములకు మార్కింగ్ ఇచ్చినా ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. చట్టప్రకారం మార్కింగ్ ఇచ్చిన ఆ కట్టడాలను తొలగించి రోడ్డు విస్తరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారు రెడ్డి, వైసీపీ నేత కల్లూరు నాగేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీడీవోలతో జడ్పీ చైర్మన్ భేటీ

కడప రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవింద రెడ్డి మంగళవారం కడపలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోలతో సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జడ్పీ చైర్మన్ జిల్లా సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారని ఆయా మండలాల ఎంపీడీవోలు తప్పకుండా హాజరు కావాలని జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ సర్క్యులర్ ద్వారా సూచించారు. కొనసాగుతున్న జడ్పీ పనులు, అభివృద్ధి కార్యక్రమాలు, తాగునీటి పైపులైన్లు తదితర వాటిపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జడ్పీలో మరో రెండు నెలల్లో రెండవసారి సాధారణ బదిలీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎంపీడీవోలతో జడ్పీ చైర్మన్ భేటీ కానుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

యువకుడి దారుణహత్య

6



సంఘటన స్థలంలో సాదిక్‌వలి మృతదేహం

అరటికి భారీ నష్టం

● ఈదురుగాలులతో 240 హెక్టార్లలో అరటి నేలమట్టం

● రూ.8 కోట్ల వరకు పంట నష్టం

● పెనుగాలుల ధాటికి విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు



పెద్దకుడాలలో దెబ్బతిన్న అరటిని పరిశీలిస్తున్న జోగిరెడ్డి

లింగాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలంలో సోమవారం సాయంత్రం వీచిన పెనుగాలులకు అరటిచెట్లు నేలకూలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని పెద్దకుడాల, లింగాల, చిన్నకుడాల, బోనాల, గుణకనపల్లె, రామనూతలపల్లె గ్రామాల్లో సుమారు 240 హెక్టార్లలో అరటి తోటలు దెబ్బతిన్నాయని ఉద్యాన అధికారి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. ఆ మేరకు మంగళవారం అధికారులకు నివేదికలు పంపించామన్నారు. 240 హెక్టార్లలో అరటి నేలవాలడంతో రైతులకు సుమారు రూ.8కోట్ల వరకు నష్టం వాటిల్లింది. దిగుబడులు చేతికందుతున్న సమయంలో సంవత్సరం కష్టం నేలపాలు కావడం రైతులను తీవ్రంగా కలచి వేస్తోంది. ఎకరా సాగు చేయాలంటే కనీసం రూ.1.50లక్షలు పెట్టుబడి అవుతుంది. ఏడాది పాటు కంటికి రెప్పలా పంటను కాపాడుకున్న అన్నదాతలకు పెనుగాలులు భారీనష్టం చేకూర్చాయి. అరటి సాగు అంటేనే రైతులు భయపడేలా ఈ సంవత్సరం గాలులు వణికిస్తున్నాయి. గత నెల 22వ తేదీన వీచిన గాలులకు 570 హెక్టార్లలో అరటి నేలకూకూలింది మరువక ముందే మళ్లీ ప్రకృతి ప్రకోపానికి అరటి రైతు బలయ్యాడు. లింగాలలో ప్రతాపరెడ్డికి చెందిన మొక్కజొన్న పంట మొత్తం నేలవాలింది. ప్రభుత్వం తమను ఉదారంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పెనుగాలుల ధాటికి పది విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. మూడు ట్రాన్స్‌ఫార్మర్లకు నష్టం వాటిల్లింది. కాగా పెద్దకుడాల, గుణకనపల్లె గ్రామాలలో దెబ్బతిన్న అరటి తోటలను మంగళవారం తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ చేతికందుతున్న సమయంలో అరటిచెట్లు నేలకూలడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల టీడీపీ కన్వీనర్ విశ్వనాథరెడ్డి, నాయకులు అమర్‌నాథ్, మాధవరెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లింగాలలో నేలవాలిన మొక్కజొన్న



పెద్దకుడాలలో పెనుగాలులకు వేపచెట్టు కూలడంతో విరిగిన విద్యుత్ స్తంభం

ముగ్గురికి కందుకూరి పురస్కారాలు

కడప కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కందుకూరి విశిష్ట జిల్లాస్థాయి పురస్కారాలకు జిల్లావాసులు ముగ్గురు ఎంపికయ్యారు. ఈ మేరకు కడపకు చెందిన మూల మల్లికార్జునరెడ్డి, ప్రొద్దుటూరుకు చెందిన రావులూరి సుబ్రహ్మణ్యం, కావడి సుభాష్‌చంద్రబోస్‌కు మంగళవారం సమాచారం అందింది. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. వీరికి రూ.10వేల నగదుతో పాటు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేయనున్నారు.



కావడి సుభాష్ చంద్రబోస్



మూల మల్లికార్జునరెడ్డి



రావులూరి సుబ్రహ్మణ్యం

రైలుకింద పడి వ్యక్తి మృతి



సిద్దయ్య (ఫైల్)

నందలూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నందలూరు రైల్వే కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం సుమారు 2.10 గంటల సమయంలో కల్లగొట్ల సిద్దయ్య(45) అనేవ్యక్తి గూడ్సు రైలు కింద పడి మృతిచెందారు. ఈ సంఘటనపై జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ సుభాన్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ వీధి, రంగసముద్రం, పోరుమామిళ్ల ప్రాంతానికి చెందిన సిద్దయ్య రైలు కింద పడి మృతిచెందారన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప పట్టణంలోని రిమ్స్‌కు తరలించారు.

ఓబులవారిపల్లెలో: మండల పరిధిలోని ముక్కావారిపల్లె గ్రామ పంచాయతీలోని తురకపల్లెకు చెందిన షేక్ అహ్మద్‌అలీ(40) ప్రమాదవశాత్తు రైలుకింద పడి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... తురకపల్లె గ్రామానికి చెందిన షేక్ అహ్మద్‌అలీ బేల్దారి పనులు చేసుకుంటూ జీవించేవాడు. ఇతనికి భార్య మౌలాని, ఏడుగురు సంతానం, వీరిలో ఇద్దరు ఆడబిడ్డలు, ఐదుగురు మగపిల్లలు. కుటుంబ పోషణ, ఆర్థిక సమస్యలతో సతమతమయ్యేవాడు. ఓబులవారిపల్లెలో బంధువుల ఇంటికి వెళ్లే క్రమంలో రైల్వేస్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తు రైలుకిందపడి మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాటుసారా తయారు చేస్తున్న మహిళ అరెస్టు

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారు చేస్తున్న ఓ మహిళను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం సాయంత్రం మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆధ్వర్యంలో దాదినాయనితాండా అటవీప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. నాటుసారా తయారు చేస్తున్న బుక్కే సురేష్ భార్య సవిత(19)ను అదుపులోకి తీసుకుని 52 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు పారిపోయిన సురేష్‌నాయక్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ జబీవుల్లా, పీసీలు నాగరాజు, మధు, రేఖ పాల్గొన్నారు.

కొడుకుపై తండ్రి కత్తితో దాడి

రైల్వేకోడూరురూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీవీ కండ్రిక పంచాయతీ పరిధిలోని పిట్లవారిపల్లిలో సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో తండ్రి కొడుకుపై దాడి చేశాడు. పోలీసుల వివరాల మేరకు... పిట్లవారిపల్లికి చెందిన చింతల వెంకటయ్య అనే వ్యక్తి మద్యం మత్తులో తన భార్యతో గొడవ పడుతుండగా కొడుకు చింతల శివ తండ్రిపై ఘర్షణ పడ్డాడు. ఈ ఘర్షణలో వెంకటయ్య శివపై కత్తితో దాడి చేయడంతో శివ తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు వెంటనే శివను రైల్వే కోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో క్షతగాత్రుడిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రైల్వేకోడూరు సీఐ హేమసుందర్ తెలిపారు.

కురబలకోట యువకుడు మృతి

కురబలకోట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో జరిగిన గొడవలో కురబలకోట మండలానికి చెందిన యువకుడు మృతి చెందాడు. మండలంలోని నాయనవారిపల్లెకు చెందిన వెంకటశివ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. రెండు రోజుల క్రితం రాంభగీచా వద్ద వాహనాన్ని నిలుపగా తిరుపతికి చెందిన ముగ్గురు డ్రైవర్లు అతనితో గొడవపడ్డారు. వారు రాయితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన వెంకటశివను తిరుపతికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సస్యరక్షణ పరికరాలు పంపిణీ



రైతులకు వేయింగ్ మిషన్ పంపిణీ చేస్తున్న ఏడీ నాగరాజు

సిద్దవటం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు 50 శాతం సబ్సిడీపై సస్యరక్షణ పరికరాలు పంపిణీ చేసినట్లు బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. సిద్దవటం వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రైతుసేవా కేంద్రాల వ్యవసాయశాఖ సహాయకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర కేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ ప్రతినిధి వంశీ, శివఫణీంద్ర, రైతుసేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మామిడి కోతలు

- రైతులకు అనుకూలంగా ధరలు
- తోటల నుంచే ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు



రైల్వేకోడూరు మామిడి యార్డులో ట్రేల్లో ఉంచిన పులిహోర కాయలు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో మామిడి కోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం రైతులకు మామిడి ధరలు అనుకూలంగా ఉండడంతో తోటల నుంచే ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి మాసంలో మామిడి పూతలు అనుకున్న స్థాయి కంటే ఎక్కువగా రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జనవరి ఆఖరిలో పూతలు ఉన్న సమయంలో వర్షం పడింది. వచ్చిన పూతంతా మగ్గి రాలిపోయింది. దీంతో ఈ ఏడాది 15 శాతం మాత్రమే పూత నిలవడంతో మామిడి పూతలు, పిందెలు, కాయలు నిలవడానికి ఈ ఏడాది రైతులు చాలా కష్టాలే పడ్డారు. కొందరు రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా పిచికారి చేశారు. చాలా మంది రైతులు ఆర్గానిక్ పరంగా ఉన్న పశువుల ఎరువు, పులిసిన మజ్జిగ, వేప నూనె తదితర వాటిని పిచికారి చేశారు. దీంతో ఆశించిన దిగుబడి సాధించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులను వాడిన వారి సక్రమంగా పూతలు, కాయలు నిలువకుండా పోయాయని పలువురు రైతులు చెబుతున్నారు. ఈ సారి మామిడికి బూడిద, తేనె మంచు, పండుఈగ తదితర రకాల తెగుళ్లు ఆశించాయి. దీనికి మందులు ఉపయోగించాల్సి వచ్చింది. ఒక రైతు రెండు సార్లు మాత్రమే గతంలో మందులను పిచికారి చేయాల్సి వచ్చేది. ఈ ఏడాదిలో నాలుగు సార్లు మందులను పిచికారి చేయాల్సి వచ్చింది. ఎకరాకు కూలీలు, దున్నకాలు, మందులు తదితర వాటికి రూ.20 నుంచి రూ.25 వేల వరకు ఖర్చు అయిందని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా మామిడికి వాతావరణ పరిస్థితులు కూడా పెద్దగా అనుకూలించలేదు. దీంతో చాలా మంది రైతుల తోటల్లో కాపు రాలేదు.

రైల్వేకోడూరు, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేలి మండలాల్లో తోతాపూరి, పులిహోరా, కాలేపాడు, మల్లిక, ఖాదర్, బేనీషా, రసాలు, మాల్గోవా, నూనెపసందు, చెఱుకురసం, నీలం, రుమాణి తదితర రకాలను రైతులు పండిస్తున్నారు. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, జైపూర్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు కాయలను ఎగుమతి చేస్తున్నారు. రైల్వేకోడూరు మామిడి యార్డులో సుమారు రూ.100 కోట్లకు పైగా వ్యాపారం సాగుతుంది. 2 వేల మంది కూలీలు జీవనోపాధి పొందుతారు. అదేవిధంగా మార్కెట్ కమిటీకి సెస్సు లక్షల్లో వస్తుంది. 45 మామిడి మండీలున్నాయి. దక్షిణ భారత దేశంలోనే రైల్వేకోడూరు మామిడికి పేరుంది. కాగా ఈ ఏడాది కాపు తక్కువగా ఉన్నందున కేవలం రెండు నెలలు మాత్రమే వ్యాపారం సాగుతుందని ఇటు రైతులు, అటు వ్యాపారులు అంటున్నారు. ప్రకృతి వైపరిత్యాలు లేకుండా ఉంటే మామిడి రైతులకు అనుకూలంగా ఉంటుంది. ఏప్రిల్, మే మాసాల్లో ఎక్కువగా పెనుగాలులు ఉంటాయి. ప్రస్తుతం పచ్చడి, పండుకు జైపూర్ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు రైతుల తోటల నుంచే సాగుతున్నాయి. పులిహోరా పండుకు టన్ను రూ.30 నుంచి రూ.40 వేలు, రుమాణి పచ్చడికి టన్ను రూ.20 వేలు, బేనీషా పండుకు రూ.50 నుంచి రూ.70 వేలు, తోతాపూరి టన్ను రూ.20 నుంచి రూ.30 వేలు, నాటు రకాలు (ఊరగాయకు) టన్ను రూ.15 నుంచి రూ.20 వేలు వరకు ధర ఉందని రైతులు, వ్యాపారులు అంటున్నారు. కాయలు ఉన్న రైతుకు ప్రస్తుతం కనక వర్షం కురుస్తుంది. గతేడాది వరకు బేనీషా కాపు బాగానే వచ్చింది. ఈ ఏడాది మాత్రం కాపు తక్కువగా రావడం కొసమెరుపు.

వర్షాలకు మామిడి దెబ్బతింది




ఈ ఏడాది జనవరిలో కురిసిన వర్షాలకు మామిడి దెబ్బతింది. ఉన్న పూతంతా మగ్గి రాలిపోయింది. తర్వాత వచ్చిన పూతలు సక్రమంగా నిలువలేదు. దీంతో ఈ సారి దిగుబడులు తక్కువగా వచ్చాయి. ఇప్పటికైతే వ్యాపారం బాగానే ఉంది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా వివిధ రకాల మామిడి కాయలను పండిస్తున్నారు.

- పీరాన్, వ్యాపారి, రైల్వేకోడూరు



తోటలో కాసిన బేనీషా కాయలు

మామిడి ధరలు అనుకూలంగా ఉన్నాయి



మామిడి ధరలు అనుకూలంగా ఉన్నాయి. ప్రస్తుతం పండు, పచ్చడి కాయలను తోటల నుంచే రైతులు, వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. మామిడికి విపరీతంగా తెగుళ్లు వచ్చాయి. వాటిని తట్టుకునేందుకు అనేక రకాల మందులను రైతులు పిచికారి చేయాల్సి వచ్చింది. కొందరు రైతులు మామిడి యార్డు నుంచి కాయలను తరలిస్తున్నారు.

- చంద్రశేఖర్‌రాజు, రైతు, సీఎం రాచపల్లె



ఇతర రాష్ట్రాలకు లోడింగ్ చేస్తున్న కూలీలు

దేశవాళీ రకాలను సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్



దేశవాళీ సదస్సులో మాట్లాడుతున్న చంద్రానాయక్

కలికిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో దేశవాళీ రకాల సాగు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ సూచించారు. ఇప్పటికే ఎన్నో రకాల దేశవాళీ రకాలు కనుమరుగయ్యాయని, ఇప్పటికైనా ఉన్నవాటిని కాపాడుకోవలసిన అవసరముందని ఆయన తెలిపారు. స్థానిక కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన దేశవాళీ రకాల విత్తనాలు, పూలు, పండ్లు ఇతర ఉత్పత్తుల ప్రదర్శన సందర్భంగా రాయలసీమ స్థాయి రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ దేశవాళీ విత్తనాలను తిరిగి ప్రాచుర్యంలోకి తెచ్చి, వాటికి భౌగోళిక గుర్తింపు తీసుకురావాలని కోరారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ దేశవాళీ పంటలు పురాతన కాలం నుంచి సహజ సిద్ధంగా రూపుదాల్చినవని, వీటిని కాపాడుకుని పునరుత్పత్తికి కృషి చేయాలని కోరారు. హైబ్రిడ్ జాతులకు అంటుకట్టే విధానంలో ఇప్పటికీ దేశవాళీ రకాల వేర్లను మూలాలుగా తీసుకుంటున్నారనే విషయం గుర్తించాలన్నారు. వాటి ప్రాముఖ్యతను పరిరక్షించాల్సిన అవసరముందన్నారు. దేశవాళీ రకాలను కాపాడటం వల్ల భావి తరాలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ప్రతి దేశవాళీ రకానికి ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, ఇప్పటికైనా జాగ్రత్తలు తీసుకుని ఆ సంతతిని కాపాడుకోవాలన్నారు. చింత, సీతాఫలం, మామిడి లాంటి పంటలకు భౌగోళిక గుర్తింపు తీసుకు రావాలని కోరారు. దీనికి ప్రస్తుత సదస్సుతో పునాది పడిందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్), ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీలు ఈ ప్రదర్శనకు సహకారమందించాయి. ఈ ప్రదర్శనలో దేశవాళీ రకాలతో వరి, చిరుధాన్యాలు, నూనె గింజలు, అపరాలు, పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, పసుపు, పూలు, చింత తదితర రకాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ సదస్సులో కేవీకే కోఆర్డినేటర్ మంజుల, తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీ సుమతి, శాస్త్రవేత్తలు డా.జాన్, రూపేశ్‌కుమార్‌రెడ్డి, శ్రీవల్లి, కలికిరి ఉద్యాన, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాళ్లు స్వరాజ్యలక్ష్మి, సుబ్రమణ్యం, జిల్లా సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్‌రావు, ఆర్‌డీటీ మురళి, అభ్యుదయ రైతులు చందూల్ కుమార్‌రెడ్డి, స్వాతి, మధులత, మధుకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శివారెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు, పలువురు రైతులు, వ్యవసాయ విద్యార్థులు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి దారుణహత్య





హత్యగురైన సాదక్‌వలి (ఫైల్‌ఫొటో), సంఘటన స్థలంలో సాదిక్‌వలి మృతదేహం

కడప క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో నడిరోడ్డుపై ఓ యువకుడు అందరూ చూస్తుండగానే దారుణ హత్యకు గురయ్యాడు. నిందితుడు ఆటోలో వచ్చి ఆ యువకుడిని పిడిబాకుతో పొడిచి ఆపై కత్తితో గొంతుకోసి పరారయ్యాడు. కడప నగరం మరాఠివీధికి చెందిన సాదిక్‌వలి(34) పండ్ల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాడు. ఇతడు మంగళవారం రాత్రి బిల్టప్ వద్ద నిల్చుని ఉండగా ఆటోలో వచ్చిన ఓ వ్యక్తి అందరూ చూస్తుండగానే హత్య చేసి పరారయ్యాడు. గతంలో సాదిక్ వలి ఓ వ్యక్తిని బిల్టప్ సర్కిల్ వద్దనే మద్యం సీసాతో హత్య చేశాడు. ఈ నేపథ్యంలో పాత కక్షలతోనే ఇతడిని హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, తాలూకా సీఐ వెంకటేశ్వర్లుతో పాటు స్పెషల్ బ్రాంచ్ సీఐలు భాస్కర్‌రెడ్డి, పురుషోత్తమ రాజు ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. హత్యకు గల కారణాలు పోలీసుల వివరాల్లో తెలియాల్సి ఉంది. హత్యకు సంబంధించి అక్కడ ఉన్న సీసీ పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.



అందరూ చూస్తుండగా రోడ్డులో సాదిక్ వలి గొంతుకోస్తున్న నిందితుడు

ముగిసిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు

అనంతపురంక్లాక్‌టవర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో నిర్వహించిన ఏపీ రాష్ట్ర స్థాయి 10వ ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ మెమోరియల్ రగ్బీ సీనియర్ పురుషులు, మహిళల పోటీలు మంగళవారం ముగిశాయి. నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ఫైనల్ పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగంలో నెల్లూరు ప్రథమస్థానం, కర్నూలు ద్వితీయ స్థానం, గుంటూరు తృతీయ స్థానం, అనంతపురం నాలుగో స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో తూర్పుగోదావరి విజేతగా నిలవగా, ఉమ్మడి అనంతపురం జిల్లా రన్నరప్‌గా నిలిచింది. డీఆర్‌ఓ మలోలా, పీటీసీ అడిషనల్ ఎస్పీ మల్లికార్జున వర్మ, ఆర్డీఓ కేశవ నాయుడుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్య క్షుడు సుధా మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జానీశంకర్, కార్యదర్శి సంపత్‌కుమార్, కోశాధికారి శ్రీనివాసులు రెడ్డి, ఆర్గనైజింగ్ డైరెక్టర్ రాజశేఖర్, మెడికల్ డైరెక్టర్ కృష్ణ, సీనియర్ క్రీడాకారులు బయన్న, శంకర్, తిప్పేస్వామి, కవిత, నిర్మల, భార్గవి, తిరుపాల్, అజయ్ బాబు, సురేష్‌బాబు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



రామాపురం చెరువులో మట్టి పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

'ఉపాధి' వెతలు

- ఉపాధి కూలీలకు అందని వేతనాలు
- కూలీలకు తాగునీరు, నీడ కరువే
- గుర్రంకొండలో నామమాత్రంగా పనులు

గుర్రంకొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు, కూలీలు వలసలు వెళ్లకుండా నివారించడానికి కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టింది. అయితే కూలీలకు ఉపాధిహామి సిబ్బంది పనులు కల్పించడంతో విఫలం అవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధి పనుల వద్ద కూలీలకు తాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ కిట్స్, మజ్జిగ తదితర సౌకర్యాలను నామమాత్రంగా కల్పిస్తున్నారు. దీనికితోడు కూలీలకు మూడు నెలలుగా వేతనాలు రాలేదు. ఈ నేపథ్యంలో ఉపాధిహామీ పనులపై కూలీలు మక్కువ చూపడం లేదు. ఈ క్రమంలో ఉపాధి పనులకు రావడానికి కూలీలు సుముఖత చూపడం లేదు.

గుర్రంకొండ మండలంలో 15 పంచాయతీలలో 6 వేలు జాబ్‌కార్డులున్నాయి. ఇందులో ఉపాధిహామీ పథకంలో ఐదు వేల మంది కూలీలుండగా ప్రతి ఏటా రెండు నుంచి మూడు వేల మందిలోపు కూలీలు పనులు చేస్తున్నారు. ఉపాధి పనులు ప్రతి ఏటా జనవరి నుంచి జూన్ నెల వరకు బాగా జరుగుతాయి. ఈ ఆరు నెలల కాలంలో కూలీలకు పెద్దగా వ్యవసాయ, ఇతర కూలి పనులు దొరకవు. దీంతో ఉపాధి సిబ్బంది కూలీలకు పనులపై అవగాహన కల్పించి కూలీల సంఖ్యను పెంచాల్సి ఉంది. అంతేకాకుండా వేసవిలో కూలీలకు అదనంగా పనిదినాలు, వేతనాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచుతున్నాయి. దీంతో ఉపాధి సిబ్బంది క్షేత్ర స్థాయిలో రైతులకు అవసరమైన పనులను గుర్తించి చేయించాల్సి ఉంది. ప్రజలకు అవసరమైన పనులు చేపడితే కూలీల సంఖ్య పెరిగే అవకాశముంది. గుర్రంకొండ మండలంలో ఐదు వేల మంది ఉపాధి కూలీలుండగా కేవలం కొన్ని గ్రామాల్లో మాత్రమే ఉపాధి పనులు జరుగుతున్నాయి. దీంతో 15 పంచాయితీలకు గానూ కేవలం 500 మంది మాత్రమే పనులు చేస్తుండడం విశేషం. దీనిని బట్టి చూస్తే ఉపాధి సిబ్బంది పనితీరు గుర్రంకొండ మండలంలో ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.

కూలీలకు అందని వేతనాలు..

ఉపాధిహామి పథకంలో భాగంగా వివిధ పనులు చేసిన కూలీలకు వేతనాలు అందలేదు. ఈ ఏడాది జనవరి 15వ తేది నుంచి ఏప్రిల్ 14వ తేది వరకు కూలీలు పనిచేసిన మూడు నెలలకు సంబంధించి వేతనాలు నిలిచిపోయాయి. కూలీలకు రావాల్సిన వేతనాలే రూ.71,92,800 పెండింగ్ ఉంది. అలాగే గ్రామాల్లో ఉపాధి పథకంలో సీసీ రోడ్లు, కాలువలు, గోకులాలు, నీటితొట్లెలకు సంబంధించిన నిధులు కూడా రూ.76,36,931 పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో కూలీలు ఉపాధి పనులపై ఆసక్తి చూపడం లేదు. దీనికి తోడు వ్యవసాయ పనులకు వెళ్లితే సాయంత్రానికి లేదా మరుసటి రోజే కూలి డబ్బును ఇచ్చేస్తుండడంతో ఉపాధి పనులకు పోవడానికి చాలా మంది మొగ్గు చూపడం లేదు.

బకాయిలతో కూలీలు రావడం లేదు

ఉపాధిహామీ పథకంలో పనులు చేసిన కూలీలకు పది వారాలకు సంబంధించి బకాయి డబ్బులు రావాల్సి ఉంది. దీంతో పనులు చేయడానికి కూలీలు ఆసక్తి చూపడం లేదు. గ్రామాల్లో ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించి కూలీల సంఖ్య పెంచడానికి ప్రతి రోజు ప్రయత్నిస్తున్నాం. ఈ వారంలో కూలీల సంఖ్య వెయ్యి దాటేలా లక్ష్యం నిర్దేశించుకుని పనులు చేయిస్తాం.

- జయరామిరెడ్డి, ఉపాధిహామీ పథకం ఏపీవో, గుర్రంకొండ మండలం

నామమాత్రంగా కూలీలకు వసతులు

ఉపాధిహామీ పథకంలో భాగంగా పనులు చేసే ప్రాంతంలో కూలీలకు తాగునీరు, మజ్జిగ, ఫస్టుఎయిడ్ కిట్, నీడ వంటి వసతులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ మౌలిక వసతులను ఉపాధి సిబ్బంది కల్పించాలి. అయితే ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశంలో ఎక్కడా కానీ వసతులు లేవు. కూలీలే తమ వెంట వాటర్ బాటిళ్లలో తాగునీరు తెచ్చుకొంటున్నారు. ఎండకు ఎండుతూ ఉపాధి పనులు చేస్తున్నారు.

కడప విపత్తుల నిర్వహణ డీపీఎంగా ఉమారాణి

కలికిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా విపత్తుల నిర్వహణ సంస్థ డీపీఎంగా కె.ఉమారాణిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఈమె స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. కాగా రాజంపేట సోమశిల ప్రాజెక్టు యూనిట్-4 భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్న బి.లీలారాణి బదిలీ చేశారు. నెల్లూరు మెప్మా పీడీగా పోస్టింగ్ కోసం మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖకు కేటాయించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

రాజంపేట మున్సిపల్ కమిషనరుగా జి.శ్రీనివాసులు

కలికిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపల్ కమిషనరుగా జి.శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్న శ్రీనివాసు లును ఖాళీగా వున్న రాజంపేట మున్సిపా లిటీకి కమిషనరుగా నియమిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

కడప డిప్యూటీ కమిషనర్‌గా రాంబాబు

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా ఆర్.రాంబాబును నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ సెక్రటరీగా విధులు నిర్వహి స్తున్న రాంబాబును కడప కార్పొరేషన్ రెగ్యులర్ డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు.

నాసిరకం విత్తనం.. దిగుబడి శూన్యం

ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్నలు నకిలీ విత్త నాలతో నట్టేట మునిగిపోతున్నారు. ఇటీవల పెండ్లిమర్రి మండలంలో ఉల్లి పంట సాగు చేసిన రైతు లు నకిలీ విత్తనాల కారణంగా దిగుబడి లేకపో వడంతో తీవ్రంగా నష్టపోయారు. రైతుల తమ గోడును, వ్యాపారి చేసిన మోసాన్ని సదరు అధికారులకు తెలియజేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో చివరకు రైతులు చేసేది లేక పంటను దున్నేశారు.

- 100 ఎకరాలలో ఉల్లిపంటను దున్నేసిన రైతులు
- రూ.కోటి వరకు పెట్టుబడి నష్టం
- నాలుగు నెలల కష్టం మట్టిపాలు
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని వైనం

కడప రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పెండ్లిమర్రి మండలంలోని బాలయ్యగారిపల్లె, నల్ల య్యగారిపల్లె గ్రామాలకు చెందిన దాదాపు 60 మంది రైతులు మైదుకూరులోని ఓ వ్యాపారి దుకాణంలో ఉల్లి విత్తనాలు కొనుగోలు చేశారు. ఒక్కొక్క ప్యాకెట్‌కు రూ.450లు చెల్లించారు. ఇలా ఒక ఎకరా సాగుకు దాదాపు 15 విత్తన ప్యాకెట్ల చొప్పున మొత్తం రూ.6750లను ఖర్చుచేసి దాదాపు 100 ఎకరాలలో పంటను సాగుచేశారు. సేద్యాలకు, ఉల్లినాటుకు, కూలీలకు, కలుపు నివారణాకు, ఎరువులకు, పురుగుమందుల పిచికారికి, నీటి తడు లకు ఇలా ఒక ఎకరాకు దాదాపు రూ.లక్ష చొప్పున 100 ఎకరాల సాగుకు రూ.ఒక కోటి వరకు పెట్టు బడి పెట్టారు. నాలుగు నెలల పాటు పంట ఎదుగుదలకు ఆరుగాలం శ్రమించారు. అన్ని దశలు పూర్తిచేసుకొని పంట నూర్పిళ్లకు రావడంతో నాసిరకం విత్తనాల డొల్లతనం భయటపడింది. ఉల్లికాడ కట్టినప్పటికీ భూమిలో ఉల్లిగడ్డ ఊరకుండా ఎదుగుబొదుగు లేకుండాపోయింది. దీంతో చేసేది లేక బాధిత రైతులు పంటను ట్రాక్టర్లు, సేద్యపు యంత్రాలు(టిల్లర్లు)తో చెడగొ ట్టారు. వ్యాపారి చేసిన మోసాన్ని ఉద్యానశాఖ అధికారులకు మొరపెట్టుకున్నారు. ఇటీవల జరి గిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో వ్యవ సాయ స్థాయి సంఘం చైర్మన్ (జడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్) స్వయాన రైతుల గోడును, వ్యాపారి చేసిన మోసాన్ని సదరు అధికా రులకు తెలియజేసినా పట్టించుకోలేదు. దీంతో బాధిత రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.


పెండ్లిమర్రి మండలం నల్లయ్యగారిపల్లెలో ఎదుగుబొదుగు లేని ఉల్లిపంట (ఫైల్ ఫొటో)

10 ఎకరాల్లో పంట సాగు చేసి నష్టపోయా...



రబీ పంట కింద గత నవం బర్‌లో 10 ఎకరాల్లో ఉల్లిపంట సాగుచేశాను. ఓ మధ్యవర్తి ద్వారా మైదు కూరులోని ఓ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణం నుంచి ఉల్లి విత్తనాలు కొనుగోలు చేశాను. పెట్టుబడి కింద దాదాపు లక్ష రూపాయల ఖర్చుచేశా. నాశి రకం విత్తనాల కారణంగా ఉల్లికాడ కట్టినప్పటికీ భూమిలో గడ్డ ఊరకుండా పోయింది. వ్యాపారిని ప్రశ్నిస్తే సరైన సమాధానం ఇవ్వకుండా దాటవే స్తున్నాడు. ఉద్యానశాఖ అధికారులకు తెలియజే సినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

-ధనుంజయరెడ్డి, నల్లయ్యగారిపల్లె

పట్టించుకునే వారేరి..

జిల్లాలో నాశిరకం విత్తనాల రైతులు నష్టపోతున్నా పట్టించుకునేవారే లేరు. జిల్లాలోని ఆయా వ్యవ సాయ డివిజన్లలో వందల సంఖ్యలో విత్తన, ఎరు వులు, పురుగుమందుల దుకాణాలున్నాయి. వీటి లో చాలా వరకు లైసెన్స్ లేని దుకాణాలు రైతుల ను నిలువునా ముంచేస్తున్నాయి. ఇందులో మైదు కూరు వ్యవసాయ డివిజన్‌లో ప్రధానంగా ఉన్న ట్లు సమాచారం. వ్యవసాయ, విజిలెన్స్‌శాఖ అధికా రుల నామమాత్రపు దాడుల ఫలితంగా ప్రైవేట్ వ్యాపారుల దోపిడీకీ అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాసిరకం విత్తనాల వ్యాపారానికి అడ్డుకట్ట వేసి కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.

తగు చర్యలు తీసుకుంటాం..

పెండ్లిమర్రి మండలంలోని బాలయ్యగారి పల్లె, నల్లయ్యగారిపల్లె గ్రామాలలో నాసిర కం విత్తనాల వలన ఉల్లిపంట దెబ్బతిని ఉంటే శాస్త్రవేత్తల ద్వారా పరిశోధనలు చే యించి నిర్ధారణ అయితే షాపు నిర్వహకుడిపై సీడ్ యాక్టు ప్రకారం చర్యలు తీసు కుంటాం. ఏఏ గ్రామాలలో ఎన్ని ఎకరాలలో పంట దెబ్బతిందనే వివరాలను డీహెచ్ వో ద్వారా తగు రిపోర్టు తెప్పించుకుని రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం.

-ఎ.నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ జిల్లా అధికారి

పంటను తొలగించిన తర్వాత రైతులు తెలిపారు..

ఉల్లిపంట ఉద్యానశాఖకు సంబంధించినది అయినప్పటికీ.. విత్త నాలు మాత్రం సీడ్ యాక్టు కింద వ్యవసాయశాఖకు వర్తిస్తుంది. నాసిరకం విత్తనాలతో ఉల్లి పంటలో దిగుబడులు లేక నష్టపోయి నట్లు పంటను తొలగించిన తురువాత బాధిత రైతులు హెచ్‌వో కు తెలియజేశారు. అయినా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీరిని ఆ దుకోవడానికి తగు చర్యలు తీసుకుంటాం.

- సుభాషిణి, ఉద్యానశాఖ ఏడీ

ప్రసిద్ధ రంగస్థల కళాకారులకు సన్మానం


రంగస్థల కళాకారులకు సన్మానం చేస్తున్న దృశ్యం

కడప కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశలింగం పంతు లు జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 16న జరుపుకునే తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన ప్రసిద్ధ రంగస్థల కళాకా రులను సన్మానించినట్లు రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. కడప పట్టణంలోని స్థానిక పెన్షనర్స్ ఆఫీసులో మంగళవారం ఉదయం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్య క్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ 2500 నాట కాల్లో విలక్షణ మైన పాత్రలు పోషించి జిల్లాకే తలమానికంగా నిలిచి ఎన్నో అవా ర్డులు సాధించిన ఎస్.మధుబాబు, పది సంవత్సరాల వయసులో నాటక రం గంలో ప్రవేశించి నటిగా తన నటనా వైభవంతో నంది, గరుడ, కళారత్న తదితర సత్కారాలు అందుకున్న అరుణకుమారి, నాటకరంగమే శ్వాసగా జీవిస్తూ భిన్నమైన ఎన్నో పాత్రలను ధరించి జీవం పోస్తున్న దాసరి సుధా కర్, రంగస్థల కళా కారునిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, రంగస్థల కళాకారుడు పి.మల్లయ్యలను తమ సంస్థ ద్వారా సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సన్మాన గ్రహీతలు స్పందిస్తూ తెలుగునాటక రంగ దినోత్సవ సందర్భంగా జిల్లా రచయితల సంఘం ద్వారా సత్కారం పొందడం సంతోషాన్ని ఇచ్చింద న్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రామ్మూర్తి నాయు డు, కోశాధికారి నూనె నగేశ్, సంయుక్త కార్యదర్శి సుబ్బారావు, ఉపా ధ్యక్షుడు మేకల సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పులివెందులలో నాకాబందీ

- రికార్డులు సరిగా లేని 16 మోటార్‌బైకులు, ఆటో స్వాధీనం


సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని నగరిగుట్టలో మంగళవారం తెల్లవారుజామున డీఎస్పీ ఆధ్వర్యంలో నాకా బందీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు సరిగా లేని 16 మోటార్ బైకులు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. అలాగే మంగళవారం రాత్రి పులివెందుల చుట్టు ఉన్న రింగు రోడ్డు తదితర ప్రాంతాల్లో సీఐ చాంద్‌బాష తమ సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న పలు వురిపై కేసు నమోదు చేశారు. అంతకు మందు డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐ లు, సిబ్బందితో అర్బన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ మురళీనాయక్ సమావేశమయ్యారు. శాంతిభద్రతల వ్యవహారంలో కఠినంగా వ్యవహ రించాలని సూచించారు.

జమ్మలమడుగులో...

జమ్మలమడుగు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో మంగ ళవారం తెల్లవారుజాము నుంచి డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని గూ డెం చెరువు గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేసి రికార్డులు లేని 43 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ లింగప్ప గ్రామీణ పరిధిలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఎస్ఐలు రామకృ ష్ణ, హైమావతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలా పాలను నిర్మూలించడంలో భాగంగా కమలాపురంలో పోలీసులు ఆక స్మిక తనిఖీలు చేపట్టారు. మంగళవారం కమలా పురం పట్టణంలో గల బీడీ కాలనీ, ఇందిరమ్మకాలనీ ఇతర అను మానిత ప్రదేశాల్లో కార్డెన్ సెర్చ్‌లో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు సీఐ రోషన్ తెలిపారు. సరైన పత్రాలు లేని 6 మోటరు సైకిళ్లు, 1 బొలెరో క్యాంపర్, 1 ప్యాసింజరు ఆటోను సీజ్ చేసి పోలీసుస్టేషన్ తరలించామన్నారు. కమలాపురం ఎస్ఐ విద్యాసాగర్, వల్లూరు ఎస్ఐ పెద్దఓబన్న పోలీసులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఆర్పీల నిరసన


మెప్మా పీడీ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్పీలు

కడప ఎన్జీఆర్ సర్కిల్, ఏప్రిల్ 15 (ఆంధ్ర జ్యోతి): రెండు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తున్న తమను అనేక యాప్‌లు పెట్టి ఇబ్బందులు పెట్ట కుండా ఉద్యోగ భద్రత కల్పించాలంటూ మెప్మా ఆర్పీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవా రం మెప్మా పీడీ కార్యాలయం ఎదుట ఆర్పీలు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. అధ్యక్ష, కార్యద ర్శులు కుమారి, రంగమ్మ మాట్లాడుతూ తమ ను నియమించే సమయంలో పదో తరగతి ఉత్తీర్ణత అయితే చాలని నియామకాలు చేశారన్నా రు. ఇన్ని ఏళ్లపాటు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా అందుతున్న సేవలను మహిళా సంఘా లకు అందజేస్తున్నామన్నారు. అయితే ఇటీవల కాలంలో అనేక యాప్‌లను తీసుకువచ్చి డిజిటల్ పద్ధ తుల ద్వారా సేవలందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంద న్నా రు. దీంతో పాటు ఓటీపీ ద్వారా అనేక డాక్యుమెంట్లను తయారు చేయడం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సభ్యులు ఓటీ పీలు కూడా చెప్పడం లేదన్నారు. ఓటీపీలు, టెక్నా లజీపై సభ్యులకు అనుమానాలు ఉండడం వల్ల సహకరించడం లేదని.. కొన్ని సందర్భాల్లో సంఘాల్లో నుంచి నిష్క్రమించేందుకు సిద్ధపడు తున్నారన్నారు. ఆర్పీల్లోని చాలా మందికి ఈ టెక్నా లజీపై అవ గాహన లేకపోవడంతో మాకు వచ్చే అరకొర జీతంలో టెక్నాలజీ తెలిసిన వారికి ఇచ్చి వారి ద్వారా పనులు చేయించు కుంటున్నట్లు వివరించారు. దీని వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నెలకొనడంతో విధులను బహిష్కరించే పరిస్థితి ఉంద న్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు నెలకు రూ.18వేలు వేతనాన్ని పెంచుతూ తమ సొంత ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పీడీ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈత కోసం వెళ్లి విద్యార్థిని మృతి


విద్యార్థిని తేజ మృతదేహం

అట్లూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలకూరు గ్రామానికి చెందిన చిట్టిబోయిన తేజ (15) ఈతకు వెళ్లి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం తోటి విద్యార్థులతో కలిసి గ్రామ సమీపంలో సగిలేరులో నీరు పారుతుండడంతో ఆనకట్ట వద్ద ఈతకు వెళ్లింది. తోటి విద్యార్థు లతో ఈత ఆడుతుండగా నడు ముకు కట్టుకున్న ప్లాస్టిక్ వస్తువు జారి పోవడంతో నీటి ప్రవా హంలో కొట్టుకుపోయింది. గమనించిన తోటివిద్యార్థులు కేకలు వేయడంతో సగిలేరు పక్కనే ఉన్న అదే గ్రామానికి చెందిన సాంబ య్య అనే వ్యక్తి నీటిలో దూకి విద్యార్థిని కాపాడే ప్రయత్నం చేశా డు. అయితే అప్పటికే ప్రాణాలు కోల్పో యినట్లు బంధువులు తెలి పారు. కాగా, తేజ కమలకూరు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి పూర్తి చేసుకుంది. తండ్రి సిద్దయ్య జీవ నోపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లారు. కుమార్తె మృతి విషయం తెలిసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతురాలికి తల్లి సుభద్రమమ్మ, అక్క తులసి (18) తమ్ముడు నాని (11) సంవత్సరాలు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం


కొండల నాగవర్ధన్‌రెడ్డి

కొండాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తాపురం గ్రామానికి చెందిన కొండల నాగ వర్ధన్‌రెడ్డి అనే విద్యార్థి అదృశ్య మయ్యాడు. ఈ విద్యార్థి తాడిప త్రిలోని సాయిసిద్దార్థ కాలేజిలో ఇంటర్ మొదటి సంవత్సరం చదు వుతున్నాడు. ఈనెల 12వ తేదీ వచ్చిన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల య్యాడు. ఫలితాల కోసం కాలేజికి వెళ్లి, అప్పటి నుంచి కనబడటం లేదని తండ్రి పుల్లారెడ్డి తెలిపారు. ఇతని వయస్సు 16 సంవత్సరాలు ఉంటుందని, ఎవరైనా ఆచూకీ తెలిస్తే 9989500796 ఫోన్ నెంబరుకు తెలపాలని కోరారు.

అక్రమ సిలిండర్లు స్వాధీనం


సిలిండర్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

పులివెందుల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని రెండు రెస్టారెంట్‌లలో అక్రమంగా వినియోగిస్తున్న సిలిండ ర్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు కడప విజిలెన్స్ అధికారులు తెలిపారు. మంగళవారం సాయం త్రం 4.30 గంటల ప్రాంతంలో పులివెందులలోని సుజాత సినిమా హాల్ సమీపంలోని అభిరుచి ఫ్యామిలీ రెస్టారెంట్, గరండల్ బ్రిడ్జి సమీపంలోని గిరి రెస్టారెం ట్‌లపై దాడులు చేశామన్నారు. వీరు గృహ అవసరాల నిమిత్తం వాడే గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వినియోగిస్తున్నారు. వీరి నుంచి 15 గ్యాస్ సిలిండర్లను పంచనామా ద్వారా జప్తు చేసి పులి వెందుల సీఎస్‌డీటీకి అప్పగించినట్లు తెలిపారు. రెస్టారెంట్ లు నిర్వహించే సతీష్‌కుమార్, వెంకటరామిరెడ్డిలపై నిత్యా వసర సరుకుల చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి


ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయ గుంటూరు బృందం తెలిపారు. మంగళవారం పట్టణ పరిధి లోని పత్తి విత్తన దుకాణాలను పరిశీలించారు. విత్తన దుకాణాల లైసె న్సులను పరిశీలించి.. వివిధ రకాల కంపెనీల పత్తి విత్తనాల నాణ్యతను పరీక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆయిల్ సీడ్స్ బుక్కే భాస్కర్, అగ్రికల్చర్ ఆఫీసర్ శివశంకర్, జిల్లా వ్యవసాయ కార్యాలయ టెక్నికల్ గోవర్ధన్, మండల వ్యవసాయ అధికారి జి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం



వేంపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం వైఎస్ మదీ నాపురం సమీపంలో వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. గేదెల కోసం శ్రీనివాసులరెడ్డి గడ్డిని ట్రాక్టర్‌లో తీసుకువెళ తుండగా మదీనాపురం వద్ద విద్యుత్ వైర్లు తగులుకొని మంటలు చెలరేగాయి. దీంతో గడ్డికి నిప్పంటుకుని పూర్తిగా దగ్ధం కాగా ట్రాక్టర్‌కు కొంతమేర నష్టం జరి గింది. సమా చారం అందుకున్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటా హుటిన ఘటనస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. సమీపంలో ఉన్న రెండు గేదెలు గాయపడ్డాయి.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కడప రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మానసిక రోగుల కోసం ప్రవే శపెట్టిన ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం రిమ్స్ ఆవరణలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ కేంద్రాన్ని విజిట్ చేసి న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మానసిక రోగులు మందులను సకా లంలో వాడి వ్యాధి తీవ్రతను తగ్గించుకోవాలన్నారు. జాతీయ న్యాయసే వాధికార సంస్థ మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తులు, మేథో వైకల్యా లున్న వ్యక్తులకు చట్టపరమైన సేవల పథకం 2024, మానసిక ఆరో గ్యం సంరక్షణ చట్టం 2017, జాతీయ మానసిక ఆరోగ్య విధానం 2014 తదితర వాటి గురించి తెలియజేశారు.

అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం

న్యాయసేవాసదన్‌లో మంగళవారం అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ నేతృత్వంలో కమిటీ అధికారులు సెక్షన్ 436ఏ సీఆర్‌పీసీ, 479 బీఎన్ఎస్ఎస్ అర్హత కలిగిన యూటీపీల గురించి, హైకోర్టు ద్వారా బెయిల్ మంజూరైన యూటీపీల గురించి చర్చించారు. కార్యక్రమాలలో కడప అడిషనల్ ఎస్పీ, కడప డీఆర్వో, రాయచోటి రెవె న్యూ డివిజనల్ అధికారి, పురుషుల, మహిళల కేంద్ర కారాగారాల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ రాజ్యాంగ విరుద్ధం

ప్రజా సంఘాల ఐక్యవేదిక

కడప మారుతీనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీల మీద నరమేధాన్ని కొనసాగిస్తోందని ప్రజాసంఘాల నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం కడప ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, సీపీయం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనరు గోపాల్, ప్రజాహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాయలసీమ కార్మిక సమాఖ్య నాయకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను హత్య చేస్తోందని ఆరోపించారు. కాగా20న కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం పక్కన ఉన్న ఇంజనీరింగ్ హాల్లో జరిగే సదస్సుకు పెద్దఎత్తున ప్రగతిశీలవాదులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టండి

అధికారులతో మున్సిపల్ కమిషనర్

పులివెందుల టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలో పెండింగులో ఉన్న ఆస్తి, నీటి పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ కమిషనరు రాముడు పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయ అడ్మిన్, అమెనిటీ, వెల్ఫేర్‌కార్యదర్శులు, మున్సిపల్ అధికారులతో పన్ను వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్ను, ఖాళీస్థలం పన్నుబకాయిలపై రాష్ట్రప్రభుత్వం 50శాతం వడ్డీ మాఫీ చేయడం జరిగిందని,బకాయి ఉన్న గృహ యజమానులందరూ 30వతేదీలోగా పన్నులు చెల్లించి సదరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంటే 2025-26కు ఆస్తి పన్ను ఏకమొత్తంగా చెల్లించినా 5 శాతం రాయితీ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ రెవెన్యూ అధికారి మునికుమార్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

బోగస్ పట్టాలపై ఆందోళన తప్పదు : సీపీఎం

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బోగస్ పట్టాలను రద్దు చేయకపోతే ఆందోళన తప్పదని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ హెచ్చరించారు. రెవెన్యూ అధికారుల పాత్రపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని కోరారు. కడప నగరం 15వ డివిజన్ సరోజినీ నగర్ వద్ద ఉన్న ఆచార్య కాలనీలో మౌలిక సమస్యలు బోగస్ పట్టాలు భూకబ్జాలపై మంగళవారం సీపీఎం పార్టీ ప్రతినిధి బృందం ఆచారి కాలనీలో పర్యటించింది. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దస్తగిరిరెడ్డి, గోవిందు, నరసింహ, శేఖర్, జార్జి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సౌకర్యార్థం జడ్పీలో వాటర్ ప్లాంట్

కడప రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజాపరిషత్తు కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది సౌకర్యార్థం ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి, వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం వారు జడ్పీలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో సి. ఓబులమ్మ , ఏవోలు భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

● **కలెక్టర్‌ను కలిసిన జడ్పీచైర్మన్ :** జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి మంగళారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను గౌరవపూర్వకంగా కలిశారు. ఈ సంర్భంగా కలెక్టర్‌ను శాలువతో సత్కరించి బొకేను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్ పాల్గొన్నారు.

విజయదుర్గమ్మ సన్నిధిలో రాహుకాల పూజలు



కడప కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి అమ్మవారి ఆలయం మంగళవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం



గ్రామోత్సవంలో చెక్కభజన వేస్తున్న దృశ్యం

సీకేదిన్నె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చింత కొమ్మదిన్నె మండలం పెద్దకాంపల్లెలో సీతారామ లక్ష్మణ విగ్రహాలకు గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మంగళవారం విగ్రహమూర్తులను గ్రామంలో ఊరేగించారు. గ్రామోత్సవంలో చెక్కభజన కార్యక్రమాలు, కోలాటాలు ఏర్పాటుచేసి గ్రామోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. ప్రజలు సీతారాములకు అడుగడుగునా ప్రతి ఇంటి నుంచి స్వామివారికి కాయాకర్పూరం అందించారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ, స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

'అనుబంధపత్రాలు ఇవ్వండి'

చెన్నూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా పక్కాఇళ్లు మంజూరయ్యే ప్రతి ఒక్కరికీ ఇంటి నివేశ ధృవీకరణ పత్రాలు (అనుబంధ పత్రం) ఇవ్వాలని, ఇచ్చే సమయంలో ఎలాంటి ఇబ్బందులు పెట్టవద్దని టీడీపీ జిల్లాఅధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ అన్నారు. ఈ మేరకు తహసీల్దారు సరస్వతికి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పాతబస్టాండ్..!



కడప పాతబస్టాండ్‌లో అధ్వానంగా ఉన్న ఫ్లోరింగ్



కడప నాగరాజుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి నాడు గౌరవంగా నిలిచిన పాత బస్టాండ్ పరిస్థితి ఇప్పుడుచెత్త దిబ్బలా మారి దర్శనమిస్తోంది. ప్రయాణికుల రద్దీకి నిలయ కావాల్సిన ఈ ప్రాంగణం పగుళ్లపడిన నేలలు, కనపడని తాగునీటి సదుపాయం, కనీసం మూత్ర విసర్జనకు కూడా అనువైన చోటు లేని పరిస్థితి తలెత్తింది. ప్రజలకు, ప్రయాణించే బస్సులకు ముప్పుగా మారిన స్థితిని చూస్తే బాధ కలుగుతుంది. స్తంభాల మీద చెత్త, తాళ్లు వేలాడుతూ, పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతున్న దృశ్యాలు కింద పగుళ్లతో దెబ్బతిన్న కాంక్రీట్ కనిపిస్తున్నాయి. పగిలిపోయిన నేలపై వృద్ధులు,చిన్నపిల్లలునడవడమే ఒక సాహస ప్రక్రియ ఖాళీగా ఉన్న స్థలాల్లో చెత్త, ప్లాస్టిక్, రాళ్లు పేరుకుంటూ ఉన్నాయి. ఫస్ట్ఎయిడ్, అగ్నిమాపక నిరోధక వ్యవస్థ, బేబీ ఫీడింగ్ కేంద్రం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లులాంటి కనీస సౌకర్యాలు అసలే లేవు. ఒకవైపు ప్రభుత్వం నగరాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తోంది. నగరంలోని సర్కిళ్లపై ఉన్న శ్రద్ధ నిత్యం వేలాది మందితో కిటకిటలాడుతూ ఎంతో అభివృద్ధిచెందాల్సిన నగరం నడిబొడ్డును ఉన్న పాత బస్టాండ్‌పై అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రజల నిత్యజీవితానికి అత్యవసరమైన బస్టాండ్ పునరుద్ధరణపై మాత్రం అధికారుల దృష్టిపడడం లేదు. నగరం నుంచి జిల్లాల నలుమూలలకే కాకుండా రాష్ట్రరాజధాని, ఇతర రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, తెలంగాణకు బస్సులు నడుస్తుంటాయి. కనీసం స్థాయికి తగ్గట్లుగా బస్టాండ్‌ను తీర్చిదిద్దడంలో అధికారులు, పాలకులునిర్లక్ష్యం వహిస్తున్నారు. జిల్లా కేంద్రమైన కడపలో పాత బస్టాండ్‌ను పట్టించుకున్న పాపానపోలేదు. పాత బస్టాండ్‌కు పునర్వైభవం వస్తుందని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.



గోడలపై మొక్కలు మొలిచిన దృశ్యం

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

పులివెందుల రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రోగాలు దరిచేరకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని బాకరాపురం వైద్యాధికారి డాక్టర్ శాంతికుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య కార్యకర్త లక్ష్మి, ఆశాకార్యకర్తలు శిరీష, జ్యోతి, ప్రిన్సిపాల్ రవికాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

వేంపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాకీయనాయకుడిగా, పారిశ్రామికవేత్తగా, విద్యార్థులకు సాంకేతిక విద్యనందించడంలో మాజీ ఎమ్మెల్యే కందుల శివానందరెడ్డి సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి, ఎస్కేఓఆర్సీ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాదరావు తెలిపారు. వేంపల్లెలోని ఐటీఐలో కందుల శివానందరెడ్డి జయంతి కార్యక్రమంలో భాగంగా మంగళవారం కందుల శివానందరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజీవ్‌నగర్ కాలనీలోని అనాథ శరణాలయంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టి.వెలమవారిపల్లె మాజీ సర్పంచు రహీం, ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

అవినీతి విచారణపై జాప్యం తగదు

వేంపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీలో జరిగిన అవినీతిపై విచారణ జరపడంలో జాప్యం తగదని డీఎల్‌పీఓ రమాదేవిని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు హరిప్రసాద్ కోరారు. 2019-22 మధ్య అవినీతి జరిగిందని ఫిర్యాదు చేయగా విచారణకు డీఎల్‌పీఓను నియమంచిన విషయం తెలిసిందే. దీనిపై విచారణను త్వరగా పూర్తిచేయాలని కోరినట్లు తెలిపారు. విచారణను పారదర్శకంగా నిర్వహించి అవినీతిని వెలికితీయాలని వారిని మరోమారు కోరినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

ఎగువపల్లెలో వన భోజనం

లింగాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువపల్లె గ్రామంలో మంగళవారం గ్రామ ప్రజలు వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి పండుగ తర్వాత వచ్చే మొదటి లేదా రెండో మంగళవారం వన భోజన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ.

'రోస్టర్ విధానంలో సమన్యాయం చేయాలి'

పులివెందుల రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రోస్టర్ విధానంలో మాదిగలకు సమన్యాయం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి రామయ్యగారి కృష్ణమూర్తితో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల వర్గీకరణకు సంబంధించి రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ మార్చి 11వ తేదీన ప్రభుత్వానికి నివేదిక సమర్పించిందన్నారు. ఈ అంశంపై శాసన సభలో ఏకగ్రీవ తీర్మానం చేశారన్నారు. అయితే జనాభా నిష్పత్తి ప్రకారం రావాల్సినంత రిజర్వేషన్లు దక్కకపోవడం బాధాకర మన్నారు. ఈ విషయంపై ఈనెల 21వ తేదీన సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ముందు ధర్నా నిర్వహించను న్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డప్పు చర్మకారుల రాష్ట్ర అధ్యక్షులు నాగ భూషణం, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, ప్రొద్దుటూరు మండల అధ్యక్షుడు బాల నరసింహులు, బలపనూరు భార్గవ, భీమన్న, గంగులయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

పాల్ ప్రకాశ్ బిషప్‌కు ఘన సత్కారం



బిషప్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పులివెందుల రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రోమ్ నగరం, రోమన్ క్యాథలిక్ మిషన్ అధినేత, వాటికన్ సిటీకి చెందిన పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపు దూత నున్షియో లియో పోల్డ్ గిరిలి, తెలుగు కథోలిక ఆర్చ్ బిషపల్ కార్డినల్ పూల ఆంథోనిచే అభిషేకిం పబడిన సగినాల పాల్ ప్రకాశ్ బిషప్‌ను పులివెందులకు చెందిన పలువురు సత్కరిం చారు. మంగళవారం ఆయనను కలిసి పులివెందుల పునీత జోజప్ప దేవాలయం పులివెందుల విచారణ గురువులైన రెవరెండ్ ఫాదర్ ఆరోగ్యస్వామి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప, సంఘ పెద్దలు దమయన్‌రెడ్డి, చిన్నపరెడ్డి, భూష ణం, రాయపరెడ్డి, కరస్పాం డెంట్ కుమార్ అభినందనలు తెలిపి సన్మానించారు.

జూదరుల అరెస్టు

పులివెందుల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నగరిగుట్టలో జూద మాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. మంగళవారం సాయంత్రం దాడులు చేసి ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.6550 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేల్పుల చెరువుకు నీటి విడుదల



వేముల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పుల చెరువుకు మంగళవారం నీటిని విడుదల చేశారు. మంగళవారం హెచ్ఎల్సీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి స్విచ్ ఆన్ చేసి మోటార్‌ను ఆన్ చేశారు. లింగాల కుడి కాల్వ నుంచి నీటిని ఎత్తిపోసి వేల్పుల చెరువుకు నీటిని మళ్లించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పేర్ల శేషారెడ్డి, వేల్పులు చెరువు చైర్మన్ శ్రీనివాసులరెడ్డి, వేల్పుల సొసైటీ అధ్యక్షుడు రాగిపిండి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నీటితొట్లు



వేంపల్లె-రాయచోటి రహదారిలో అద్దాలమర్రి క్రాస్ వద్ద ఏర్పాటుచేసిన నీటితొట్టి

చక్రాయపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సూర్యుని ప్రతాపం తాళలేక మూగ జీవాలు నీటి కోసం తహతహలాడిపోతున్నాయి. మూగ జీవాల సేవే పరమార్థంగా పెట్టుకొని మారెళ్లమడక గ్రామ సర్పంచు నరసింహులు నీటితొట్లు కట్టించి దాహార్తిని తీరుస్తున్నాడు. మారెళ్లమడక గ్రామంలోని మూడు ప్రాంతాలలో గ్రామ పంచాయతీ నిధులతో రూ.80వేలు ఖర్చు చేసి గండి దేవస్థానం గోశాల సమీపంలో ఒకటి, మారెళ్లమడక అటవీప్రాంతంలో ఒకటి, గ్రామ సమీపంలో ఒకటి ఏర్పాటుచేశారు. వీటిలో సమృద్ధిగా నీరు ఉంటుండడంతో మూగజీవాలు దాహార్తి తీర్చుకుంటున్నాయి. ప్రతి గ్రామంలో నీటితొట్లు ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. వేంపల్లె-రాయచోటి ప్రధాన రహదారిలో నిర్మించిన నీటితొట్లు వానరులకు, ఇతర అన్ని మూగజీవాలకు ఎంతో ఉపయోగపడుతోంది. 11గంటల సమయంలో వందల సంఖ్యలో మూగజీవాలు దాహార్తిని తీర్చుకుంటున్నాయి.

సింహాద్రిపురం పశుసంవర్ధక ఏడీ పులివెందులకు బదిలీ

కలికిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీగా పనిచేస్తున్న డాక్టర్ వి.శివప్రసాద్‌ను డిప్యుటేషన్‌పై పులివెందులకు బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పులివెందులలోని ఏపీ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ఆన్ లైవ్‌స్టాక్ (ఏపీసీఆర్ఎల్) కేంద్రంలో ఏడాదిపాటు పనిచేసేందుకు ఆయన్ను డిప్యుటేషన్‌పై నియమిస్తూ పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ ఇన్‌చార్జి కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

వేంపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డయేరియాపై పిల్లలు, గర్భిణీలు అప్రమత్తంగా ఉండాలని తాళ్లపల్లె హెచ్ఈ షఫీఉన్నీసా తెలిపారు. నందిపల్లె గ్రామంలో డయేరియాపై ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. చిన్నపిల్లలు ఉన్న వారు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగాలని తెలిపారు. ఓఆర్ఎస్ ద్రావణ తయారీ విధానాన్ని వివరించారు. సీహెచ్ఓ రమాదేవి, నాగస్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చెన్నూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. ఈ పనులను చెన్నూరు పట్టణంలోని ప్రధాన వీధిల్లో చేపడుతున్నందున నాగులకట్ట వీధి, అమ్మవారిశాల వెనుక వీధి, వనంవీధి, బాలికల పాఠశాల, రామాలయంవీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల నాకాబందీ



పెండ్లిమర్రి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెల్లటూరు గ్రామంలో మంగళవారం ఉదయం సీఐ చల్లని దొర ఆధ్వర్యంలో పోలీసులు నాకాబందీ నిర్వహించారు.ఈసందర్భంగా సరైన పత్రాలు లేని 5 ద్విచక్ర వాహనాలు,ఒక ఆటోను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. మండల పరిధిలోని వెల్లటూరు,నంది మండలం, పెండ్లిమర్రి గ్రామాలలోని బ్యాంకు అధికారులతో సీఐ సమావేశం నిర్వహించారు బ్యాంకులలో సీసీ కెమెరాలు, ఏటీయంల వద్ద భద్రత తదితర వాటిపై చర్చించారు.

బోర్ల పరిశీలన

వేంపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని రాజీవ్‌నగర్ కాలనీ, పులివెందుల రోడ్డులో నూతనంగా వేసిన బోర్లను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సాలన్న పరిశీలించారు. తాగునీటి సమస్య ఉండడంతో బోర్లు వేయించినట్లు టీడీపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ డీఈకి తెలిపారు. ఇంకా పలుచోట్ల అవసరం ఉందని డీఈకి తెలిపారు. కాగా చింతలమడుగుపల్లెలో తాగునీటి ఎద్దడి దృష్ట్యా నూతన బోరు వేసేందుకు సర్పంచు ఆర్.శ్రీను పూజ చేసి బోరు పనులను ప్రారంభించారు.

సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి

చెన్నూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా ఏ పార్టీ, స్వచ్ఛంద సంస్థలు అయినా సభలు, సమావేశాలు ర్యాలీలు నిరసనలు ఆందోళనలులాంటివి ఏర్పాటు చేసుకోవాలనుకుంటే ముందుగా స్థానిక పోలీసుస్టేషన్ నుంచి అనుమతి తీసుకోవాలని సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ ఆదేశాలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి

కడప క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక కడప ఫైర్ స్టేషను అధికారి బస్విరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మహవీర్ సర్కిల్ వద్ద అగ్నిమాపక విన్యాసాలు నిర్వహించారు. అనంతరం అక్కడున్న స్థానికులకు వాహనదారులకు అగ్నిప్రమాదాల నియంత్రణపై ఏర్పాటు చేసిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్..: అగ్నిప్రమాదాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని పులివెందుల ఫైర్ స్టేషన్ ఆఫీసర్ పి.సునీల్‌కుమార్ సూచించారు. మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పూలంగళ్ల సర్కిల్, మెయిన్ బజార్, తీసేసిన బస్టాండ్ సర్కిల్‌లో నీటి విన్యాసాలు చేశారు. ఆయా ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు కరపత్రాల ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం రూరల్..: అగ్ని ప్రమాదం ఎక్కడైనా సంభవించినప్పుడు 101కి సమాచారం ఇవ్వాలని అగ్నిమాపక ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అగ్నిమాపకసిబ్బంది ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు కార్యక్రమాన్ని కమలాపురం నగర పంచాయతీపరిధిలో బస్టాండు ఆవరణంలో రైల్వేస్టేషన్ స్థానిక మూడురోడ్ల కూడలి సెంటరులో నిర్వహించారు. మంగళవారం బస్టాండులో అగ్నిమాపక ప్రమాదాల పట్ల అవగాహన చేశారు.

వేంపల్లె..: అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. వేంపల్లె అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ సర్కిల్, నాలుగురోడ్ల కూడలి, బస్టాండ్ ప్రాంతంలో అగ్నిమాపక వాహనం ద్వారా మంటలను ఆర్పేందుకు నీటిని స్ప్రే చేసే ప్రదర్శన నిర్వహించారు.



పులివెందులలో..



కడపలో మహవీర్ సర్కిల్ వద్ద అగ్నిమాపక సిబ్బంది విన్యాసాలు

కష్టాల్లో కేసీ ఆయకట్టు రైతు

●కాల్వలో తగ్గిన నీటి ప్రవాహం ●ఆందోళనలో వరి, నువ్వుల పంట రైతులు ●రాజోలి వద్ద నీటిమట్టం తగ్గిందంటున్న అధికారులు



దువ్వూరు వద్ద కేసీ కాలువలో తగ్గిన నీటి ప్రవాహం



కేసీ నీటి ఆధారంగా సాగుచేసిన వరి పంట

దువ్వూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కేసీ ఆయకట్టు రైతులు కష్టాల్లో పడ్డారు. కాలువలో నీరు ప్రవహిస్తుండడంతో రైతులు విస్తృతంగా పంటల సాగుకు పూనుకున్నారు. వరి, నువ్వు, కర్బూజ పంటలను వేశారు. వరి సాగుకు నిరంతరం నీటి అవసరం ఉంటుందని తెలిసి రైతులు కొందరు పంట పెట్టారు. మరికొందరు అడపా దడపా వచ్చినా నువ్వు, కర్బూజ పంటలు పండించుకోవచ్చని సాగుకు ముందడుగు వేశారు. ఏదో విధంగా ఇప్పటి వరకు కాలువకు నీరు అందాయి. ఉన్నఫలంగా కాలువలో ప్రవాహం ఆగిపోయింది. దీంతో పంటలు పెట్టిన రైతుల్లో ఆందోళన నెలకొంది. పంట చేతికందాలంటే కనీసం 10 నుంచి 15 రోజులు సాగునీరు అందాల్సి ఉంది. ఉన్నఫలంగా నీరు ఆగిపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు. మండలంలోని దువ్వూరు, ఏకోపల్లె, జిల్లేళ్ల, కానగూడూరు, ఇడమడక, నేలటూరు, అన్నపుశాస్త్రులపల్లె, బుక్కాయపల్లె, ప్రాంతాల్లో పెట్టుబడులకు ఓర్చి పంటలు పెట్టారు. సాగునీరు ఆగిపోవడంతో అయోమయంలో పడ్డారు.

రాజోలి వద్ద నీటిమట్టం తగ్గింది

రాజోలి ఆనకట్ట వద్ద కుందూ నదిలో నీటిమట్టం తగ్గింది. అందువలన నీటి సరఫరా నిలిచిపోనుంది. అక్కడ నీటి సరఫరా అవకాశం ఉంటే కేసీకి నీరు వదిలే అవకాశం ఉంది. రైతులను ఇంతకుమునుపే వరి పంట సాగు చేసుకోవద్దని చెప్పాం.

- పుల్లయ్య, కేసీకెనాల్ డీఈ, మైదుకూరు

వైభవంగా అంకమ్మ మండల పూజ



కలశస్థాపన పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నడిపూరులో నూతనంగా నిర్మించిన అంకమ్మ(పార్వతీదేవి) అమ్మవారి మండల పూజలు వైభవంగా నిర్వహించారు. 41రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అన్నధానాలు నిర్వహించారు. చివరిరోజైన మంగళవారం అమ్మవారికి వేకువజామునుంచి అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. చండీహోమం, పుట్టమన్నుతో మహాలింగార్చన, రుద్రాభిషేకం, కలశస్థాపన పూజలు, గణపతిపూజ రుద్రహోమం, నవగ్రహ పూజలు, ప్రదోషపూజలు, రిత్వికులు నిర్వహించగా భక్తిశ్రద్ధలతో భక్తులు పాల్గొన్నారు. పూజల అనంతరం వేలాదిమందికి అన్నప్రసాదాన్ని పంపిణీచేశారు. మహిళా భక్తులు అమ్మవారికి గాజులతో చేసిన అలంకరణ అందరిని ఆకట్టుకుంది. చిన్నారులు చేసిన కూచిపూడి, భరతనాట్యం అలరించాయి. ప్రతి రోజూ వివిధ మండలాల నుంచి వచ్చిన భజన బృందాల ఆలాపనలు భక్తుల్లో భక్తి పారవశ్యాన్ని నింపాయి. మహిళాభక్తుల కోలాటాలు అందరిని ఆకట్టుకున్నాయి.

ఆది చెన్నకేశవుడికి ప్రత్యేక పూజలు

బద్వేలుటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చెన్నంపల్లెలోని ఆదిచెన్నకేశవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాత్రి అశ్వవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఆలయకమిటీ వారు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముగిసిన అంకాళమ్మ తిరునాళ్లు



అమ్మవారిని దర్శించుకున్న వైసీపీ నేతలు

ఖాజీపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దుంపలగట్టు అంకాళమ్మ తిరుణాళ్లను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యుడు రెడ్యం చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షించారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు. కాగా దుంపలగట్టు అంకాళమ్మ తిరుణాళ్లను పురష్కరించుకుని జిల్లాలోని వైసీపీ నాయకులు మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాష, జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షుడు రామగోవిందురెడ్డి, ఎమ్మెల్సీ గోవిందురెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే సుధ, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, మాజీ ప్రభుత్వ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డితోపాటు పలువురు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్

చాపాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సీబీఐటీ కాలేజీలో మంగళవారం డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్ నిర్వహించారు. చెన్నైకి చెందిన గరుడ ఎయిర్‌స్పేస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద్ డ్రోన్ ఎలా ఆపరేట్ చేయాలనే విషయంపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులరెడ్డి, శృతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు వద్దు ..ఆప్కాస్ ముద్దు

జమ్మలమడుగు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఏజెన్సీ వద్దు ఆప్కాస్ ముద్దు అంటూ జమ్మలమడుగు పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేస్తే ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్న మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని వారు కోరారు.

ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి ఖాజామైనుద్దీన్

చాపాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలను గురించి తెలుసుకోవాలని మైదుకూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఖాజామైనుద్దీన్ అన్నారు. పుల్లారెడ్డినగర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా కోర్టులో నడుస్తున్న కేసులు రాజీ అయితే సులభంగా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. భూములు, స్థలాలు కొనుగోలు చేసేటప్పుడు సరైన ఆధారాలు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ట్రైనింగ్ డీఎస్పీ భవానీ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్లు ధరించి లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరి ఆకుల శివరాం, అడ్వకేట్లు శ్రీనివాసులు, శివరామకృష్ణ, కరిముల్లా, టీడీపీ నాయకుడు వీరనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో కార్డెన్ సెర్చ్



సుందరయ్యకాలనీవాసులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ సుందరయ్యకాలనీలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా కాలనీల్లో తనిఖీ నిర్వహించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అను మానాస్పదంగా ఉన్నారేమోనని సోదాలు నిర్వహించారు. ఎటువంటి రికార్డు లు లేని వాహనాలు చెక్ చేసి ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అనం తరం కాలనీవాసులతో సమావేశం నిర్వహించి ఎవరైనా కొత్త వ్యక్తులు కానీ, అనుమానాస్పద వ్యక్తులు కానీ ఈ ఏరియాలో కనిపించినట్లయితే పోలీసు లకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే లాడ్జిలలో తనిఖీలు చేసి లాడ్జికి వచ్చేవారి ప్రతి ఒక్కరి చిరునామా నమోదు చే సుకోవాలన్నారు. సీసీ కెమెరాలు తప్పక ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు



టి.కోడూరులో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ, ఎస్సైలు

కొండాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ, తాళ్లప్రొద్దుటూరు ఎస్సై హృషికేశ్వర్‌రెడ్డిలు హెచ్చరించారు. మండలంలోని టీ.కోడూరు. సంకేపల్లె గ్రామాల్లో మంగళవారం తమ సిబ్బందితో కలిసి వారు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు అనంతరం నిర్వహించిన గ్రామసభలలో వారు మాట్లాడారు. చిన్న చిన్న సమస్యలు వస్తే తమ దృష్టికి తేవాలన్నారు. ప్రశాంత జీవనానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు.

దొమ్మరనంద్యాలలో పోలీసుల తనిఖీలు



మాట్లాడుతున్న రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి

మైలవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొమ్మరనంద్యాల గ్రామంలో మంగళవారం జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. గడ్డివాముల్లో, పలు ఇళ్లలో సోదాలు నిర్వహించడంతోపాటు రికార్డులు లేని వాహనాలను తనిఖీలు చేశారు. అనంతరం శివారెడ్డి కాలనీలో గ్రామస్థులకు సమావేశం నిర్వహించి మైలవరం జలాశయం నుంచి కాలువల్లో ప్రవహిస్తున్న నీటిలో ఈత కొట్టేందుకు పిల్లలు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. అలాగే లైసెన్సులు లేకుండా వాహనాలను రోడ్డుపై తిప్పరాదన్నారు. కార్యక్రమంలో మైలవరం, తలమంచిపట్నం ఎస్ఐలు శ్యాంసుందర్‌రెడ్డి, లక్ష్మి నారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో అగ్ని ప్రమాదాలపై జాగ్రత్త వహించాలి



అగ్నిమాపక విన్యాసాలు చేస్తున్న ఫైర్ సిబ్బంది

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్త వహించాలని ఆ శాఖా అధికారులు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అగ్ని ప్రమాదాలపై ఆశాఖ సిబ్బంది పట్టణంలోని శివాలయం సెంటర్ ఆర్టీ సీ బస్టాండ్ ఆవరణలో విన్యాసాలు నిర్వహించారు. అనంతరం అగ్ని మాపక శాఖ వేసిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్ని మాపక అధికారి రఘనాథ్ సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగు పట్టణంలో మంగళవారం వేసవిలో అగ్నిప్రమాదాల జాగ్రత్తలపై ఆశాఖా సిబ్బంది అవగాహన కల్పించారు. ముందుగా వారు కరపత్రాలు అందించారు. పాఠశాలలు, ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్ తదితర చోట్ల కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు, ఆర్పకుండా అజాగ్రత్తతో పడవేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి సత్యంరెడ్డి, వారి సిబ్బంది పాల్గొన్నారు.

బద్వేలులో: అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం బద్వేలు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఆశాఖా సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం బస్టాండు ప్రాంతలో కంట్రోలర్ ప్రసాద్ ప్రయాణికులకు అగ్ని ప్రమాదాల వారోత్సవాల పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జా నుంచి చర్మకారుల స్థలాన్నికాపాడతాం



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్

బద్వేలు, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామ పొలం సర్వే నెం.15/80లో ఉన్న మూడు ఎకరాల 64 సెంట్ల స్థలాన్ని కబ్జా కాకుండా చూసి ఉపాధి అవకాశాలు కల్పించే విదంగా కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గన్నేపాటి మల్లేష్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల మాదిగ చర్మకారులకు లెదర్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నా రు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్ బీ బంగ్లాలో మాజీ లీడ్ క్యాప్ డైరెక్టర్ గూడురు రాజశేఖర్ కలిసి విలేకర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ ప్రాంత మాదిగ నిరుద్యోగ విద్యార్థులకు ఉపాధి అవకాశం కల్పిస్తామన్నారు. దళిత సీనియర్ నాయకులు ఓఎస్‌వీ ప్రసాద్, ముండ్లపాటి పిచ్చయ్య, కమలాపు రం బాలయ్య, దళిత వేదిక జిల్లా నాయకులు ఓబయ్య, కోడూరు ఓబయ్య పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డికి సేవాపురస్కారం



కలసపాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్ల పాడు గ్రామానికి చెందిన వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డికి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలం సేవారత్న పురస్కారం వరించింది. ఈయన సేవలను గుర్తించి బాపట్ల జిల్లా చీరాలకు చెందిన కృతి ఫౌండేషన్ సంస్థ ఈ పురస్కారాన్ని అందించింది. ఈ అవార్డు తన బాధ్యతను పెంచేలా ఉందని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్‌ను వాడకుండా పూర్తిగా నిర్మూలించాలి

బద్వేలు, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండు ఆవరణలోని షాపులతోపాటు మున్సిపాలిటీలో ఎక్కడ కూడ సింగల్ యూజ్ ప్లాస్టిక్ బదులు ప్రభుత్వం సూచించిన ప్రత్యామ్నాయం వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి సూచించారు. మంగళవారం ఆయన బస్టాండు ఆవరణలో పరిశీలించి నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను వాడుకలోకి తీసుకురావాలని అధికారులను కోరారు. షాపులవారు చెత్త బయట వేయరాదని చెత్త సేకరణ వాహనాలలో మ్రాతమే వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాల్మన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్‌కార్యాలయం వద్ద సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సాల్మన్ మాట్లాడుతూ చనిపోయిన కార్మికులు స్థానంలో వారి కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలన్నారు. అనంతరం మున్సిపల్ శానిటరీ సూపర్ వైజర్ నూర్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ , పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్ , కోశాధికారి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బస్ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



ప్రొద్దుటూరు అర్బన్ ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బస్ డ్రైవర్ కుటుంబానికి ప్రొద్దుటూరు డిపో తోటి డ్రైవర్లు మంగళవారం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లు, ఓనర్లు, మేనేజర్లు కలసి రూ 32వేలనగదు తోపాటు, రెండు ప్యాకెట్లు బియ్యం, నిత్యావసర సరుకులను వారి ఇంటికి వెళ్లి అందించా మన్నారు. మేనేజర్ రాజనాల నరేష్, తిట్ల సాల్మన్, శ్రీనివాసుల యాదవ్, తిట్ల డాని యల్, ప్రొద్దుటూరు, మైదుకూరు డ్రైవర్లు మానవత్వం చాటుకున్నారని తెలిపారు.

మూగజీవాలతో రాజకీయం చేయడం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి

ముద్దనూరు ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):మూగ జీవులను అడ్డం పెట్టుకొని వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి రాజకీయాలు చేయడం తగదని జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. ముద్దనూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ...టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ గోసంరక్షణశాలలో గోవులు మృతి చెందాయంటూ వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి మార్ఫింగ్ గోవుల కళేబరాల చిత్రాలతో వెంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఆరోపనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి ఉన్నప్పుడు ఆయన చేసిన అవినీతి, అక్రమాలు అందరికీ తెలిసిందేనన్నారు. నిరాధార ఆరోపణలు చేసిన కరుణాకర్‌రెడ్డి పై టీటీడీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు అన్ని గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో భూపేష్‌రెడ్డి ప్రత్యేకంగా మాట్లాడారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల మార్కెట్ యార్డు చైర్మన్ నాగరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు చింతా శివరామిరెడ్డి, నాయకులు రంగారెడ్డి, కేశవరెడ్డి, జగదీశ్వరరెడ్డి, శేఖర్‌నాయుడు, ఆది, శ్రీకాంత్, అమీర్ పాల్గొన్నారు.

ఖాళీ స్థలాన్ని ఏ సంస్థకు కేటాయించ వద్దు



ఆర్డీవో కార్యాలయం వద్ద మాట్లాడుతున్న కొండపాపాయపల్లె గ్రామస్థులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పెద్దముడియం మండలం పరిధిలోని నాగిరెడ్డిపల్లె గ్రామ రెవెన్యూలో ఖాళీగా ఉన్న స్థలాన్ని ఏ సంస్థకు కేటాయించరాదని గ్రామస్థులు కోరారు. ఆమేరకు జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. నాగిరెడ్డిపల్లెరెవెన్యూలో ఉన్న సర్వే నంబరు 224లో మిగిలిన సుమారు 350 ఎకరాల భూమిని పశువుల మేత కోసం ఉపయోగంలో ఉందన్నారు. అయితే ప్రస్తుతం సోలార్ నిర్మాణం పేరుతో చదును చేసి గ్రామస్థులకు నష్టం జరుగుతోందన్నారు. అలాగే తుమ్మలకుంట చెరువు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తాగునీటి వనరుగా ఉందన్నారు. మానవతా దృక్పథంతో జిల్లా కలెక్టర్, జమ్మలమడుగు ఆర్డీవో తగు చర్యలు తీసుకుని భూమిని సంరక్షించడంతోపాటు ఏ సంస్థలకుగానీ, కంపెనీలకు లీజుకు ఇవ్వవద్దన్నారు. కాగా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ వినతి పత్రంలో అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు జీతాలు చెల్లించాలి



జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు 65 మందికి వెంటనే జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్ బాబుకు రెండు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే జీతాలు విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యం మా ట్లాడుతూ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ సకాలంలో కాంట్రాక్టరు కట్టడంలేదన్నారు సం వత్సరానికి రెండుజతలు యూనిఫాం ఇవ్వాలని అగ్రిమెంటులో ఉన్నా యూనిఫాం ఇవ్వడంలేదన్నారు. జీవో నెంబరు 549 ప్రకారం రూ.16వేలు జీతం అయితే కేవలం రూ. 12,400 మాత్రమే చెల్లిస్తూ తక్కిన వేతనం కాంట్రాక్టరు జేబులో వేసుకుంటు న్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆసుపత్రి యూనియన్ గౌరవాధ్యక్షుడు రాఘవ, సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్, ఆసుపత్రి యూనియన్ అధ్యక్షురాలు రత్తమ్మ కార్యదర్శి కళావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహులు పాల్గొన్నారు.

పెనుగాలులతో అరటి రైతులకు తీవ్రనష్టం



నేలకొరిగిన అరటి చెట్లను చూపిస్తున్న రైతు

ముద్దనూరు ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని ఆరవేటిపల్లె గ్రామంలో సోమవారం సాయంత్రం వీచిన పెనుగాలులకు అరటిచెట్లు నేలకొరిగి రైతన్నకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆరవేటిపల్లె అరటికి ప్రసిద్ధి, ఇక్కడ వందల ఎకరాల్లో అరటి సాగు చేస్తారు. సోమవారం భారీగా గాలివీచడంతో అరటి పంట భారీ గాదెబ్బతింది, అరటి గెలతో చెట్లు నేల కొరిగాయి. దాదాపు 10 ఎకరాల్లో 5వేలకు పై చిలుకు చెట్లు విరిగి నేల కొరిగాయి.భారీగా పంట నష్టం వాటిల్లినట్లు రైతులు గంగప్ప, శేషన్న, శవశంకర్, రామలింగం, నాగేశ్వరరెడ్డి, గంగులు ఇతరులు వాపోయారు. ఉద్యానశాఖ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోలేదని రైతులు తెలిపారు.తమకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంటలను పరిశీలిస్తాం:ఆరవేటిపల్లె అరటిచెట్లు నెలకొరిగినట్లు తమ దృష్టికి వచ్చింది.బుధవారం ఆరవేటిపల్లె కు వెళ్లి పరిశీలిస్తా ముద్దనూరు ఉద్యానశాఖాధికారి మల్లేశ్వరరెడ్డి తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆయన అన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలంటూ సీఎంకు లేఖ

బద్వేలు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మాన్ని కాపాడాలంటూ హిందూ ధర్మరక్ష వేదిక సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలకు ఆర్ఎస్ఎస్ సంఘ్‌చాలక్ రామకోటిరాజు, విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు కొండపల్లి సుభాష్‌లు బహిరంగ లేఖ రాశారు. ఈ మేరకు మంగళవారం బద్వేలు డివిజను ఆర్డీఓ చంద్రమౌళికి లేఖను అందించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ సంఘ్‌చాలక్ రామకోటిరాజు లేఖను అందజేసి విలేకరులకు వివరాలను వెల్లడించారు. హిందూ దేవాలయాల్లో వచ్చే ఆదాయం పూర్తిగా హిందూ ధర్మానికే ఖర్చు పెట్టాలని, అలాగే ప్రతి సంవత్సరం జమాఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలని లేఖలను పోస్టు ద్వారా, మెయిల్ ద్వారా పంపినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ బద్వేలు ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, గోపవరం వీహెచ్‌పీ అధ్యక్షుడు పత్తిపాటి నరసింహులు, కార్యదర్శి ప్టిట వేణుగోపాల్‌యాదవ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ధర్మిశెట్టి వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడు కటారు కిరణ్‌కుమారి, కార్యదర్శి శ్రీనివాసులు, సీనియర్ నాయకుడు కుప్పాల నరసింహులు పాల్గొన్నారు.

అతిసార పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో అతిసారం ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మహలక్ష్మి పేర్కొన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం స్టాఫ్ డయేరియా అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 15 నుంచి మే 31వ తేదీ వరకు ఉధృత అతిసార నియంత్రణ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సోములవారిపల్లె పంచాయతీ పరిధిలో సుబ్బారావు కొట్టాలు, ఈశ్వర్‌రెడ్డినగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆప్తమిక్ ఆఫీసర్ తేజ, సూపర్‌వైజర్ బీప వరప్రసాద్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం తప్పనిసరి

కొండాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు చిన్నపిల్లలు పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఎంఈవోలు ఓబులేసు, రామయ్యలు తెలిపారు. కొండాపురం-3, చౌటిపల్లె అంగన్‌వాడీ కేంద్రాలలో మంగళవారం పోషన్‌ప క్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భవతులు 1000 రోజలపాటు పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత లేకుండా జాగ్రత్తపడవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న చాటకొండు రాధాక్రిష్ణ (75) మృతి చెందినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. సోమవారం వాహనం ఢీకొనడంతో కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయని, గాయపడ్డ అతన్ని మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.